PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 259 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 13 సెప్టెంబర్ 2026


### సీతారాం ఏచూరి జీవితం ఎందరికో ఆదర్శప్రాయం




### శనిగరంలో కాంగ్రెస్ పార్టీ నిరసన




# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

● నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు ● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం ● గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్,సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మిగతా2లో...



# ఉత్సాహంగా బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

- సర్కారుపై విమర్శలు, చురకలు, జోకులు
- ఉత్సాహంగా బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ
- సీఎం పాత్రలో తలసాని
- మంత్రి ఉత్తమ్ పాత్రలో పల్లా
- రెవెన్యూ మంత్రి పొంగులేటిని ఇమిటేట్ చేసిన గంగుల

**హైదరాబాద్,సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** శాసనసభ నుంచి సస్పెండైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు పోటీగా మాక్ అసెంబ్లీని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం లోపాలను, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రధానంగా మాక్ అసెంబ్లీ ఫోకస్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారీనీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్యంగా ఇది సాగింది. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మిగతా2లో...

# 'ఢిల్లీ డిక్లరేషన్'కు ఆమోదముద్ర

● బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం ● డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ ● పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన ● ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం ● భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు ● ఘనంగా ప్రారంభమైన బ్రిక్స్ సమావేశాలు

● పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం




**న్యూఢిల్లీ,12(పిసిడబ్ల్యూ న్యూస్):**భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మం డపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్‌కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. మిగతా2లో...

### సుద్దాల అశోక్ తేజకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం




# అందుబాటులోకి హైడ్రా అధికారిక పోర్టల్

ఒకే వేదికపై పౌర సేవల సమాచారం

వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కమిషనర్ ఏవీ రంగనాథ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** హైడ్రా అందిస్తున్న సేవల వివరాలతో పాటు కార్యకలాపాల సమాచారాన్ని ఒకే వేదికపై తెలుసుకునేలా అధికారిక పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం అధికారిక వెబ్‌సైట్ (https://hydraa.telangana.gov.in/) ప్రారంభించారు. హైడ్రాకు సంబంధించిన వివిధ సేవలు, అధికార పరిధి, చెరువుల హద్దులు, కాలువల వివరాలు, ప్రభుత్వ భూములు, విపత్తు నిర్వహణ సమాచారం, క్షేత్రస్థాయి కార్యకలాపాలను పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. పోర్టల్‌లో మిగతా2లో...


# రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు



**హైదరాబాద్,సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది.ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ మిగతా2లో...

# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

● తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం ● కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు ● ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ



**హైదరాబాద్,సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో కొత్త పించన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు మిగతా2లో...

# సిఎం రేవంత్‌రెడ్డి అవినీతిని బయటపెడతా...

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్,సెప్టెంబర్12(పిసిడబ్ల్యూ న్యూస్):**ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అవినీతి సామ్రాట్.. బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడు అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మిగతా2లో...

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ



# ‘దిల్లీ డిక్లరేషన్’కు ఆమోదముద్ర

(మొదటి పేజీ తరువాయి)

భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి ‘బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం’ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స్ సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విబేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ దిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే.. ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదాని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స్ కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స్ దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# ఉత్సాహంగా బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

మాక్ అసెంబ్లీకి మాణిక్‌రావు స్పీకర్‌గా వ్యవహించారు. ఆయా పాత్రలు పోషించిన ఎమ్మెల్యేలు పదునైన విమ ర్శలు చేస్తూనే జోకులు వేస్తూ నవ్వులు కురిపించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలు చేయకపోవడంతో సీఎం, మంత్రులపై చురకలంటిం చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్రలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసారి శ్రీనివాసయాదవ్ ఒదిగిపోయారు. హైదరాబాద్ యాసలో సీఎంపై విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి సీఎం బాధ్యతలు చేపట్టిన తర్వాత కీలకమైన విషయాల్లో ఆయన చెప్పిన మాటల ను వ్యంగ్యంగా మాట్లాడుతూ నవ్వులు పూయించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాత్రలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి మెరిశారు. ఒక సందర్భంలో ఉత్తమ్ తాను ప్రిపేర్ కాలేదంటూ చెప్పిన విషయాన్ని పల్లా జోకులు జోకులుగా చెప్పి నవ్వించారు.కాళేశ్వరం ప్రాజెక్టుల విషయంలోనూ ఆయన తీవ్రమైన విమర్శలు గుప్పించారు. 22ఏపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాత్రను మాజీ మంత్రి గంగుల కమలాకర్ పోషించారు.భూములను కొల్లగొట్టేందుకు వేలాది ఎకరాలను 22ఏలో పెట్టారంటూ విమర్శలు గుప్పించారు. మాక్ అసెంబ్లీ లో సీఎం పాత్రధారి తలసాని మాట్లాడుతూ తాము 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామన్నాం.. కానీ 25 ఏండ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని, ఈ సమయంలో ఎప్పుడైనా అమలు చేస్తామంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ తో సమస్య, పార్టీలోసమస్య, చివరకు బీఆర్ఎస్‌తోనూ సమస్యే ఉందన్నారు. ఇలా తనకు ఎన్నో సమస్యలు ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరంతో సహా ప్రాజెక్టులన్నీ నాటి ప్రధాని ఇందిరాగాంధీ నిర్మించినవేనని ఎద్దేవా చేశారు. అందర్నీ తొక్కుకుం టూ ముఖ్యమంత్రి వరకు ఎలా వచ్చాననే విషయాన్ని అడిగితే చెప్తానని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. వేసవి కాలంలో ఎన్ని టన్నుల ధ్యానం వచ్చిందో తనకు తెలియదన్నారు. పొంగులేటి పాత్రధారి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు తన సొంత డబ్బులు ఖర్చు పెట్టానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ డబ్బును ఇప్పుడు సంపాధించుకోవాలి కదా? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు తానొక్కడినే కమీషన్లు తీసుకుంటున్నట్టు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ భారతీ కాదు…భూ హారతి చేస్తామన్నారు. సమస్య ఏదైనా సెటిల్ మెంట్ లతోనే పరిష్కారమవుతుందని తెలిపారు. మాక్ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డితోపాటు పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి హైడ్రా అధికారిక పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

హైడ్రా 24 గంటల అత్యవసర హెల్ప్‌లైన్ 1070 వివరాలను పొందుపరిచారు. చెట్లు కూలిపోవడం, అగ్ని ప్రమాదాలు, రహదారులపై నీరు నిలవడం, వరదలు, సహాయక చర్యలు, ఇతర విపత్తు పరిస్థితులపై పౌరులు ఈ నెంబర్‌కు సమాచారం ఇవ్వొచ్చు. **ఫైర్ ఎన్‌వోసీకి ఆన్‌లైన్ దరఖాస్తు** హైడ్రా పోర్టల్ ద్వారానే ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీలకు దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించారు. భవన యజమానులు, నిర్మాణదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతోపాటు తమ దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అధికారులు శాఖ డ్యాష్‌బోర్డు ద్వారా దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకునే వీలుంది. భారీ వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచే అవకాశం ఉన్న కీలక ప్రాంతాల వివరాలను అందుబాటులో ఉంచారు. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఏఎంసీ కమిషనరేట్ల పరిధిలోని వాటర్‌లాగింగ్, వరద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్‌లను చూడొచ్చు. పోర్టల్ ద్వారా లైవ్ రైన్‌ఫాల్ మ్యాప్స్, రోజువారీ వర్షపాతం వివరాలు, వాతావరణ అంచనాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం అందుబాటులో ఉంటుంది. **ఎఫ్‌టీఎల్, చెరువులు, బఫర్ జోన్ల వివరాలు** హైడ్రా వెబ్‌సైట్ నుంచి ‘హెచ్ఎండీఏ లేక్స్ ప్రొటల్’ను నేరుగా సందర్శించి చెరువులకు సంబంధించిన ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) వివరాలను తెలుసుకోవచ్చు. చెరువులు, ఇతర జలాశయాల చుట్టూ అమల్లో ఉండే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనలపై పోర్టల్‌లో సమాచారం అందుబాటులో ఉంటుంది. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం, తాజా వివరాలు కూడా పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయి. హైడ్రా అధికారిక ప్రకటనలు, ప్రెస్ రిలీజ్‌లు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, ముఖ్యమైన ప్రజా సమాచారం కోసం ప్రత్యేకంగా ‘న్యూస్, ఫ్లాస్ న్యూస్’ విభాగాలను ఏర్పాటు చేశారు. దాంతోపాటు భూ భారతి పోర్టల్‌కు హైడ్రా వెబ్‌సైట్‌లో నేరుగా లింక్ అందుబాటులో ఉంది. భూమి కొనుగోలు, ఇతర లావాదేవీలు చేపట్టే ముందు సర్వే నంబర్ లేదా పట్టాదారు వివరాల ఆధారంగా అందుబాటులో ఉన్న భూ రికార్డులను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది.

# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది. అలాగే వితంతువులు భర్త డెత్ సర్టిఫికేట్ సమర్పించాలి. అయితే భర్త చనిపోయి ఎక్కువకాలం అయితే సర్టిఫికేట్ పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఇక గీత, చేనేత, ఫైలిరియా, డయాలసిస్ వర్గాలకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ధృవీకరణ పత్రాలు పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఆ తర్వాత ధృవీకరణ సమయంలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే పింఛన్లకు అర్హత సాధిస్తారు. అధికారులే క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర ఆధారాలను పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం 2.50 లక్షల పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అంతమంది అర్హులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేయనున్నారు. ప్రాధాన్యత వారీగా పూర్తి అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేయనున్నారు. దసరా నుంచి కొత్త ఫించన్లను అందనుడటంతో అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తుది జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదించాక పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చి ంచారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు.

ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసే ందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూ పకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్య ంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

## సిఎం రేవంత్‌రెడ్డి అవినీతిని బయటపెడతా...

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఆరోపణలు చేశారు. ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతి పాపాల చిట్టాను కొడంగల్ వేదిక గా బయటపెడతామని అన్నారు. 20న కొడంగల్‌లో పాం చజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నామని, అదే రోజు కొడంగల్ వేదికగానే ముఖ్యమంత్రి అవినీతిని ప్రజలు ముందు పెడతామని కవిత చెప్పా రు. సిఎం కుటుంబ సభ్యులు, మిత్రమండలి, అవినీతి లో రాటుదేలిన మంత్రులతో కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తి అసెంబ్లీలో తనకు కమీషన్లు ఎందు కంటూ కమల్ హాసన్ లెవల్‌లో ఏకపాత్రాభినయం చేస్తుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆర్‌టిఐ చట్టాన్ని దు ర్వినియోగం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించిన చరిత్రను ప్రజలు మర్చిపోరని శనివారం ఆమె వీడియో సందేశాన్ని విడుదల చేశారు. సిఎం రేవం త్‌రెడ్డి, హరీష్‌రావు కుమ్మక్కయారని ఆరోపించారు. సిద్దిపేటలో నిషేధిత జాబితాలో ఉన్న వంద ఎకరాల భూమిని హరీశ్ రావు తన తండ్రి, కుటుంబ సభ్యుల పేరు మీదకు బదలాయించారని, దానిపై చర్యలు తీసుకునే దమ్ము ముఖ్యమంత్రికి ఉందా..? అని సవాల్ విసిరారు. అటు ప్రజా సమ స్యలను చర్చించాల్సిన అసెంబ్లీని అధికార, ప్రతిపక్షాల గొడవలకు వేదిక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. “స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది” అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ… “మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి” అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. “హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది” అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## సుద్దాల అశోక్ తేజకు ‘తెలంగాణ తెలుగు తేజం’ పురస్కారం

**హైదరాబాద్ :సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర స్థాయి బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక ‘తెలంగాణ తెలుగు తేజం’ సాహిత్య పురస్కారం-2026కు ప్రముఖ కవి, సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పురస్కార కమిటీ ఛైర్మన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం వెల్లడించారు.ఈ నెల 22న కరీంనగర్‌లో పురస్కార ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టిబిడ్డలు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి సంచలన ఆరోపణలు..



**హైదరాబాద్, సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** హరీశ్‌రావు తన పరపతిని ఉపయోగించి వేల కోట్ల విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేశారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. సిద్ధిపేట జిల్లా వెలికట్టి గ్రామంలో హరీశ్‌రావు తన మామ హనుమంతరావు పేరిట 6 ఎకరాల 18 కుంటల అసైన్డ్ భూమిని కొనుగోలు చేశారని, రూ. 12 నుంచి 18 కోట్ల విలువ చేసే ఈ భూమిని 22-ఏ నుంచి తొలగించి పట్టా భూమిగా మార్చుకున్నారని ఆయన ఆరోపించారు. ఇదే భూమిలోనుంచి వెళ్లిన మిషన్ భగీరథ పైపులైన్‌లకు కూడా డబ్బులు తీసుకున్నారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇక మెదక్ జిల్లాలోనూ భారీ భూ కుంభకోణం జరిగిందని మంత్రి ఆరోపించారు.సికింద్రాపూర్ పరిధిలో వక్ఫ్ బోర్డు క్లెయిమ్ చేసిన 569 ఎకరాల్లో, 2023 ఎన్నికల షెడ్యూల్‌కు కేవలం 5 రోజుల ముందు 372 ఎకరాలకు పైగా భూమికి ఆర్డీఓ ద్వారా ఓఆర్సీలు ఇప్పించి ఆ భూములను కాజేశారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ఈ అక్రమ భూముల ద్వారా వచ్చిన సొమ్మును ఎన్నికల్లో ఖర్చు చేశారని మంత్రి ఆరోపించారు. నర్సాపూర్ మండలంలోనూ 22-ఏ నిబంధనల నుంచి 112 ఎకరాల భూములను తొలగించి ఒకే కుటుంబానికి కట్టబెట్టారని, మెదక్ జిల్లాలో కాంగ్రెస్ గెలవకుండా కుట్ర పన్నారని పొంగులేటి తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# నారాయణపేటలో అగ్నిమాపక అధికారి.(DFO)
# ఖర్దుంగ్ లా పర్వతాల్లో పరుగుల విజేత!

## 17,965 అడుగుల ఎత్తులో 13 గంటల్లో 72 కి.మీ. ఖర్దుంగ్ లా ఛాలెంజ్ పూర్తి చేసిన జీవీ ప్రసాద్

**హైదరాబాద్, సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** నారాయణపేట జిల్లా అగ్నిమాపక కేంద్రంలో DFO గా విధులు నిర్వర్తిస్తూ.. పరుగుల ప్రపంచంలో సరికొత్త రికార్డులను సొంతం చేసుకుంటున్నారు జీవీ ప్రసాద్. ప్రజల ప్రాణాలను రక్షించే బాధ్యతలో నిరంతరం అప్రమత్తంగా ఉండే ఆయన.. తాజాగా లడాఖ్‌లో సముద్ర మట్టానికి 17,965 అడుగుల (5,476 మీటర్లు) ఎత్తులో ఉన్న ఖర్దుంగ్ లా పర్వత ప్రాంతంలో నిర్వహించిన 72 కిలోమీటర్ల ఖర్దుంగ్ లా ఛాలెంజ్2026ను 13 గంటల్లో విజయవంతంగా పూర్తి చేసి అరుదైన ఘనత సాధించారు. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో నిర్వహించే కఠినమైన పరుగుల్లో ఖర్దుంగ్ లా ఛాలెంజ్ ఒకటి. తక్కువ ఆక్సిజన్, చలి వాతావరణం, కఠినమైన పర్వత మార్గాలు రన్నర్ల సామర్థ్యానికి పెద్ద సవాల్‌గా నిలుస్తాయి. అలాంటి పరిస్థితులను అధిగమిస్తూ ప్రసాద్ ఈ సవాల్‌ను పూర్తి చేశారు.







**లడాఖ్ మారథాన్‌తో అర్హత** ఖర్దుంగ్ లా ఛాలెంజ్‌కు ముందు జీవీ ప్రసాద్ లడాఖ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సముద్ర మట్టానికి సుమారు 11,500 అడుగుల ఎత్తులో ఉన్న లడాఖ్‌లో 42.20 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేయడం ద్వారా ఖర్దుంగ్ లా ఛాలెంజ్‌లో పాల్గొనే అర్హత సాధించారు.

**'ప్రోకామ్ స్లామ్'లోనూ ఘనత** 202425లో ప్రోకామ్ స్లామ్‌లో భాగంగా బెంగళూరులో 10 కి.మీ., ఢిల్లీలో 25 కి.మీ., కోల్‌కతాలో 25 కి.మీ., ముంబైలో 42.20 కి.మీ. రేసులను విజయవంతంగా పూర్తి చేశారు. వివిధ రేసుల్లో ఇప్పటివరకు 50 పతకాలు సాధించారు.

**డీజీ అభినందనలు** ఈ అరుదైన విజయంపై తెలంగాణ అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్ గారు అభినందనలు తెలిపారు.

# శనిగరంలో కాంగ్రెస్ పార్టీ నిరసన

## దళితులను అవమానించిన కేసీఆర్ తీరుపై ఆగ్రహం.. ఎమ్మెల్సీ తాత మధును బర్తరఫ్ చేయాలని డిమాండ్

**కమలాపూర్, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు సారథ్యంలో, కమలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసాల శ్రీనివాస్ నాయకత్వంలో శనిగరం బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సుమారు 500 మంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. దళితులను అవమానించే విధంగా వ్యవహరించే వారిని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు సముచిత గౌరవం, రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు. దళిత ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఇంచార్జ్ పాడి కల్పనా దేవి, రాజేశ్వరరావు మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి ఎదిగిన గడ్డం ప్రసాద్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ గౌరవించి శాసనసభ స్పీకర్‌గా అవకాశం కల్పించిందన్నారు. స్పీకర్ పదవికి హుందాతనాన్ని తీసుకువచ్చేలా ఆయన వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గతంలో దళితులు కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన సమయంలో వారిపై పసుపు నీటితో శుద్ధి చేశారనే ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు ప్రస్తావిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడిన కేసీఆర్ తీరును ఖండించారు. "ఖబర్దార్ కేసీఆర్.. దళిత ద్రోహి కేసీఆర్" అంటూ నినాదాలు చేశారు. దళితులందరూ ఐక్యంగా ఉండి దళిత వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నేతలు రాజకీయ అలజడులు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలసాని రమేష్ గౌడ్, తౌటం రవీందర్, మార్కెట్ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, మాట్ల రమేష్, తడక శ్రీకాంత్, బొల్లం రాజిరెడ్డి, విష్ణుదాసు వంశీధర్ రావు, ఆడేపు విజయ, రెక్కల నారాయణరెడ్డి, గూడెపు మొగిలయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడ శ్రీకాంత్, పుల్ల శోభన్, నాంపల్లి ప్రభాకర్, చేరాల రోహిత్, ఎం.డి. చిన్న యాకుబ్, జనగాని శివకృష్ణ, గట్టు శ్రీధర్, బండారి సంపత్, పైసా శరత్‌తో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# సీతారాం ఏచూరి జీవితం ఎందరికో ఆదర్శప్రాయం

● సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు

**పెనుబల్లి, సెప్టెంబర్12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సీపీఎం పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ భారతదేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని అన్నారు. విద్యార్థి దశ నుండి అంచెలంచెలుగా ఎదిగారని చెప్పారు. నిరంతరం శ్రామిక జీవుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. భారతదేశంలో ఉన్న రాజకీయాలు పెను మార్పులకు గురవుతున్నాయని, కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చట్టాలను తన ఇష్టం వచ్చినట్లు మార్చుతూ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ఉన్న సంస్థలన్నిటిని ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అమ్మటానికి పావులు కదుపుతోందని, ఈ చర్యలను ప్రజలంతా ఐక్య పోరాటాలతో అడ్డుకోవాలని ప్రజా వ్యతిరేక విధానాలను బలవంతంగా అమలు చేస్తే ఏమవుతుందో మన చుట్టుపక్కలున్న శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల పరిస్థితిలను ప్రధాని మోడీ పరిశీలించాలన్నారు. ప్రజలను తిప్పలుపెట్టే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవన్నారు. సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు మాట్లాడుతూఅణగారిన వర్గాల అభ్యున్నతికి పార్లమెంట్లో గొంతెత్తి నినదించడమే కాకుండా, తన వాదనా పటిమతో ప్రత్యర్థి నాయకుల మెప్పును పొందిన గొప్ప దార్శనికుడు సీతారాం ఏచూరి ప్రపంచంలో అన్ని పార్టీలు గుర్తించిన మార్క్సిస్టు మేధావి ఏచూరి అని అన్నారు. అన్ని పార్టీల నాయకులు సైతం అభిమానించే వ్యక్తిత్వం ఆయన సొంతమన్నారు. అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం రావడంలో ప్రముఖపాత్ర వహించారని చెప్పారు. అభ్యుదయ భావాలు, విప్లవ పోరాటాల కలబోత ఏచూరి అని కొనియాడారు. బిజెపి అనుసరిస్తున్న వైఖరులను ధైర్యంగా ఎదుర్కొని ఇండియా బ్లాక్ ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. మతోన్మాద బిజెపితో దేశానికి ప్రమాదం ఎలా పొంచి ఉందో అందరికీ తెలియజేశారన్నారు. ఏచూరి స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్టిమోదు కృష్ణయ్య, అఖిల్, కాటినేని తదితరులు పాల్గొన్నారు.




# భక్తితో పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

● మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలి: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



**భూపాలపల్లి, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి పట్టణానికి మట్టి వినాయక ప్రతిమలను పంపించినందుకు సంతోష్ కుమార్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మట్టి గణేశుడి ప్రతిమలను పూజించి నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని గండ్ర వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరులు, ప్రకృతి పరిరక్షణకు తోడ్పడవచ్చని తెలిపారు. ఈ నెల 14వ తేదీన జరుపుకోనున్న వినాయక చవితి పర్వదినం సందర్భంగా భూపాలపల్లి ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# కాంట్రాక్టర్లపై కనికరం కలగదా..?

● పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి శాసనమండలి చైర్మన్‌కు కాంట్రాక్టర్ చందా కుమార్ వినతి



**ములుగు జిల్లా, సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** అభివృద్ధి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించి వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మన్‌కు ములుగు జిల్లా కాంట్రాక్టర్ చందా కుమార్ వినతిపత్రం అందజేశారు. రహదారులు, తాగునీటి పథకాలు, పాఠశాలలు, భవనాలు, సాగునీటి పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను అప్పులు చేసి పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో అధిక వడ్డీల భారం పడుతోందన్నారు. మిషన్ భగీరథ, మన ఊరుమన బడి, ఎస్‌డీఎఫ్ తదితర పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బిల్లులు ఆలస్యం కావడంతో బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు, కార్మికులు, సరఫరాదారుల బకాయిలు చెల్లించలేక కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, అర్హత ఉన్న బిల్లులను రాజకీయాలకు అతీతంగా వెంటనే చెల్లించేలా ప్రభుత్వంపై దృష్టి సారించాలని శాసనమండలి చైర్మన్‌ను కోరారు. కాంట్రాక్టర్లను అభివృద్ధి భాగస్వాములుగా గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చందా కుమార్ విజ్ఞప్తి చేశారు.

# రైతుల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం




**మల్లంపల్లి, సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని జెడీ మల్లంపల్లి టౌన్ అధ్యక్షులు చిదర సంతోష్ విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో వ్యవసాయానికి భరోసా కల్పించారని, ప్రస్తుతం రైతులకు సకాలంలో నాణ్యమైన విద్యుత్ అందకపోవడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, రైతుభరోసా నిధులు ఆలస్యం కావడం, పంట నష్టపరిహారం అందకపోవడం, రుణమాఫీపై అయోమయం, సాగునీరు, విత్తనాలు, ఎరువుల కొరత వంటి సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. పంటలు కాపాడుకునేందుకు కరెంట్ కోసం రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదని, గతంలో 24 గంటల విద్యుత్ అందించగా ప్రస్తుతం కేవలం 6 గంటల కరెంట్‌తో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి రైతులకు పూర్తి భరోసా కల్పించాలని, నిరంతర విద్యుత్ అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, రైతుల సమస్యలపై ప్రశ్నిస్తూ వారి హక్కుల కోసం పోరాడుతామని చిదర సంతోష్ స్పష్టం

# జాతీయ లోక్‌అదాలత్‌లో 391 కేసులకు పరిష్కారం

- పరస్పర అంగీకారంతో రాజీ మార్గంలో వివాదాలకు ముగింపు




**ములుగు, సెప్టెంబర్ 12:(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు సముదాయ భవనంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహి ంచారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న పలు రకాల కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించారు. సివిల్, క్రిమినల్, మనీ సూట్, ఇంజక్షన్ సూట్, మ్యాట్రిమోనియల్ వివాదాలు, చెక్ బౌన్స్, మెయింటెనెన్స్, చీటింగ్ తదితర కేసులను కక్షిదారుల పరస్పర అంగీకారంతో రాజీ మార్గంలో పరిష్కరించారు. మొత్తం 391 కేసులకు పరిష్కారం లభించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. చండేశ్వరి తెలిపారుకక్షిదారులు పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు దీర్ఘకాలంగా కొనసాగుతున్న కేసులకు త్వరితగతిన ముగింపు లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ప్రజలకు సులభమైన, వేగవంతమైన న్యాయ పరిష్కారం అందుతుందని తెలిపారు.

# కాంగ్రెస్ కరెంట్ కోతలపై రైతుల కన్నెర్ర

## కందుకూరులో సబ్‌స్టేషన్ ముట్టడి.. రైతులకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య







**వేంసూరు, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలో కందుకూరులో విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనకు దిగారు. కందుకూరు, దిద్దుపూడి, భరణిపాడు, లచ్చన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన ర్యాలీ నిర్వహించి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఏడు గంటల విద్యుత్‌ను కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడితే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను కేసీఆర్ సవాల్‌గా తీసుకుని, తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించారని అన్నారు. వ్యవసాయాన్ని దండగ నుంచి పండగగా మార్చి రైతులకు భరోసా కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు.

**మళ్లీ కరెంట్ కోతలు ఎందుకు?**

రాష్ట్రంలో మళ్లీ విద్యుత్ కోతలు ఎందుకు విధిస్తున్నారని సండ్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల విద్యుత్ అవసరాలపై ముందస్తు ప్రణాళిక లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసైనా రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.

**ఎరువుల కోసం రైతులను ఇబ్బంది పెట్టొద్దు**

ఎరువుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని సండ్ర ఆరోపించారు. యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పేరుతో రైతులకు ఇబ్బందులు సృష్టించడం సరికాదన్నారు. చాలామంది రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు లేవని, గతంలో మాదిరిగానే కూపన్ల విధానంలో ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎరువుల కొరతను ముందుగానే గుర్తించి సరిపడా నిల్వలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి**

వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కొన్ని పంటలకే పరిమితం చేయడం రైతులను మోసం చేయడమేనని సండ్ర విమర్శించారు. రైతు కూలీలకు అండగా ఉంటామని, రైతు భరోసా పెంచుతామని ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందుల్లోకి నెట్టకుండా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రచారం సరికాదు**

కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించి పనులను ముందుకు తీసుకెళ్తే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్ప నిధులతో చేపట్టిన పనులకు మొత్తం ప్రాజెక్టు ఘనతను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని సండ్ర విమర్శించారు. రైతులకు కోతలు లేని విద్యుత్ అందించి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. సండ్ర వెంకట వీరయ్య సబ్‌స్టేషన్‌లోకి వెళ్లి విద్యుత్ సరఫరాకు సంబంధించిన లాగ్‌బుక్‌ను పరిశీలించారు. లాగ్‌బుక్‌ను చూపించేందుకు అధికారులు తొలుత కొంత నిరాకరించడంతో.. విద్యుత్ సరఫరా పరిస్థితిపై మరిన్ని అనుమానాలు వ్యక్తమయ్యాయి. లాగ్‌బుక్‌ను పరిశీలించిన సండ్ర.. రైతులకు వాస్తవంగా ఎంతసేపు విద్యుత్ సరఫరా అవుతుందో, ఎంతసేపు అంతరాయం ఏర్పడుతుందో వివరాలను పరిశీలిం చారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా తప్పించుకునే ధోరణి విడనాడి.. తక్షణమే కోతలు లేని విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కందుకూరులో రైతులతో ప్రారం భమైన ఈ ఆందోళన ఆరంభం మాత్రమేనని, విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించక పోతే రైతులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సండ్ర వెంకట వీరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## జాతీయ లోక్ అదాలత్‌కు శ్రీకారం

- కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం




**హనుమకొండ, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న మూడవ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా వరంగల్, హనుమకొండ జిల్లాల్లో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల చైర్‌పర్సన్లు బి.వి. నిర్మలా గీతాంబ, ఎం. రామకృష్ణ సునీత న్యాయ సేవా సదనం భవనంలో జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు జిల్లాలకు సంబంధించిన వివిధ రకాల కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేశారు. న్యాయస్థానాల్లో సుదీర్ఘంగా కొనసాగుతున్న వివాదాలకు రాజీ మార్గంలో పరిష్కారం చూపుతూ కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంలో లోక్ అదాలత్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయని అధికారులు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన న్యాయమూర్తులు, వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్. శ్వేత, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు. అలాగే వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘాల అధ్యక్షులు సి.హెచ్. ఉపేందర్, సి.హెచ్. రామకృష్ణ, డి.సి.పి. ధార కవిత, చకిలం ఉపేందర్, చొల్లేటి రామకృష్ణ, పలువురు న్యాయవాదులు, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు, వివిధ బ్యాంకులు, బీమా సంస్థల అధికారులు, కక్షిదారులు హాజరయ్యారు. జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించబడిన కేసుల పూర్తి వివరాలను సాయంత్రం వెల్లడించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థల అధికారులు తెలిపారు.

## భగవద్గీత జ్ఞాన సంపద..

### కోటి భగవద్గీత మహా యజ్ఞం' ద్వారా కోటి మందికి గీతా పంపిణీ

### జై హనుమాన్ సేవా ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్



**కల్లూరు, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సృష్టిలో మనిషి అత్యంత బుద్ధిజీవి. కానీ ఆ బుద్ధితో ప్రకృతిని శాసించాలని చూస్తూ తన వినాశనాన్ని తానే కొని తెచ్చుకుంటున్నాడు. మనిషి తన అహంకారాన్ని వీడి, ఈ అనంతమైన సృష్టిలో తన స్థానమేమిటో, ప్రకృతితో ఎలా మమేకం అవ్వాలో తెలిపే అద్భుతమైన మార్గదర్శి, మానవాళికి లభించిన అసలైన జ్ఞాన సంపద శ్రీమద్భగవద్గీత అని జై హనుమాన్ సేవా ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్ పేర్కొన్నారు. ఇంతటి మహత్తర మైన జ్ఞానాన్ని అందరికీ పంచాలనే సదుద్దేశంతో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటి భగవద్గీత మహా యజ్ఞం కార్యక్రమాన్ని చేపట్టామని, దీని ద్వారా కోటి మందికి భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ అని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ స్వయంగా సెలవిచ్చాడని గుర్తుచేశారు. అంటే సర్వ చరాచర జగత్తు, ఈ ప్రకృతి అంతా భగవంతుని కనుసన్నల్లోనే నడుస్తోందని అర్థం. కానీ నేటి మానవుడు తన స్వార్థం, ఆధిపత్య ధోరణితో భగవంతుడు ప్రసాదించిన పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాడు. అహంకారం (అహం) ఎంతటి వినాశనానికి దారితీస్తుందో, ఆ దానవ లక్షణాల వల్ల మనిషి ఎలా పతనం అవుతాడో గీతాచార్యుడు దైవాసుర సంపద్విభాగ యోగంలో స్పష్టంగా వివరించాడని తెలిపారు. అహంకారం పతనానికి హేతువు అనడానికి పురాణాల్లోని వింధ్య పర్వతం గాథే ఒక గొప్ప నిదర్శనమని నరేష్ వివరించారు. ఒకప్పుడు తనను మించినవారు లేరనే గర్వంతో వింధ్య పర్వతం ఆకాశమంత ఎత్తుకు ఎదిగింది. చివరకు సృష్టికి మూలమైన సూర్యగమనానికే ఆటంకం కలిగించి లోకాలలో అలజడి సృష్టించింది. అప్పుడు సకల దేవతల ప్రార్థనతో అగస్త్య మహాముని ద్వారా ఆ పర్వత గర్వాపహరణం జరిగింది. ఆయనను చూడగానే భయభక్తులతో పాదాలపై వాలిన వింధ్య పర్వతం, ఆయన ఆదేశంతో శాశ్వతంగా అలాగే ఉండిపోయి తన గౌరవాన్ని కోల్పోయిందన్నారు. ప్రకృతిని శాసించాలని చూసిన మహా పర్వతానికే ఆ గతి పడితే, స్వార్థంతో విర్రవీగుతూ జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తున్న మానవుడి పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలన్నారు. బిడ్డల మంచి కోసం తల్లి కోపించినట్లుగానే.. తుపాన్లు, జలప్రళయాలు, భూకంపాలు, మహమ్మారుల రూపంలో ప్రకృతి మనకు హెచ్చరికలు పంపుతూనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విపత్తుల నుంచి బయటపడి, ప్రశాంతమైన జీవనం సాగించాలంటే మనిషికి కావాల్సింది అహంకారం కాదు.. వినయం, జ్ఞానం అని స్పష్టం చేశారు. ఆ జ్ఞానాన్ని ప్రసాదించే అత్యున్నత గ్రంథం భగవద్గీత అని.. గీత ప్రబోధించిన నిష్కామ కర్మ, అహంకార రాహిత్యం, ప్రకృతి పట్ల గౌరవం వంటి సిద్ధాంతాలను ఆచరిస్తేనే మానవాళికి భవిష్యత్తు ఉంటుందన్నారు. అందుకే భగవద్గీత కేవలం ఒక పవిత్ర గ్రంథం మాత్రమే కాదని, ఆచరించదగిన అత్యుత్తమ జీవన వికాస గ్రంథం అని పేర్కొన్నారు. ఈ జ్ఞాన సంపదను ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలనే బృహత్తర సంకల్పంతోనే కోటి భగవద్గీత మహా యజ్ఞం ద్వారా భగవద్గీత పుస్తకాలను అందిస్తున్నట్లు చెవుల నరేష్ స్పష్టం చేశారు.

## అశోక్ నగర్ 54వ డివిజన్‌లో తీరిన తాగునీటి కష్టాలు..

- మేయర్ కొలగాని శ్రీనివాస్ చేతుల మీదుగా కొత్త బోరు ప్రారంభం..



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 12(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం అశోక్ నగర్ 54వ డివిజన్ పరిధిలో నూతనంగా కలిసిన కాలనీలో నీటి సమస్యతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీవాసుల నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారంగా ఏర్పాటు చేసిన నూతన బోరును శనివారం రోజున నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. డివిజన్ కార్పొరేటర్ గొట్టేముక్కుల ఉమారాణి వెంకటరమణ కాలనీలో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిని గుర్తించి ప్రత్యేకంగా బోర్ వేయించడంతో పాటు, దానికి సక్రమంగా విద్యుత్ సరఫరా అందేలా కరెంటు మీటరు బిగించడం జరిగింది. ఈ నూతన తాగునీటి వనరును నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ, స్థానిక నాయకులు కుమార్, రమేష్, అరుణ్, శ్రీనివాస్, గండి గణేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు. ఏళ్ల నాటి తమ తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేసిన మేయర్‌కు, స్థానిక ప్రజాప్రతినిధులకు కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## మహిళా అధికారిణిని మనోవేదనకు గురిచేయడమేనా..?

### జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి చేరిన పంచాయతీ

### ఉపాధ్యాయ నాయకుల తీరుపై ఎంఈఓ పద్మ ఆవేదన




**కల్లూరు, సెప్టెంబరు 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మహిళా అధికారిణిననే కనీస గౌరవం లేకుండా నాతో వ్యవహరించారు.. గట్టిగా మాట్లాడి మానసికంగా ఇబ్బందులకు గురిచేశారు అంటూ కల్లూరు మండల విద్యాశాఖ అధికారి పొదిలి పద్మ ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. మండలంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ వ్యవహారంలో కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకుల తీరుపై ఆమె జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘాలుగా ఏర్పడిన నాయకులు.. అదే సమస్యపై అధికారులతో చర్చించే సమయంలో సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. తమ డిమాండ్లను బలంగా వినిపించడం తప్పుకాదు. అయితే ఒక మహిళా అధికారిణి మనస్థాపానికి గురయ్యేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సమస్య పరిష్కారానికి **పంచాయతీనా.. ఘర్షణనా...?** వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులతో చర్చించి, అవసరమైతే ఉన్నతాధికారులను ఆశ్రయించి పరిష్కరించుకోవచ్చు. కానీ మాటలతోనే సమస్య పరిష్కారం కావాల్సిన చోట పరిస్థితి ఉద్రిక్తంగా మారడం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్న ఉపాధ్యాయ నాయకులు తమ హోదాకు, బాధ్యతకు తగ్గట్టుగా వ్యవహరించాల్సిన అవసరం లేదా..? అన్న చర్చ జరుగుతోంది.

**సమాజానికి దిక్సూచి కావాల్సిన వారే ఇలా చేస్తే..?**

విద్యార్థులకు క్రమశిక్షణ, గౌరవం, సహనం, సంయమనం వంటి విలువలను బోధించే ఉపాధ్యాయులు వారికి నాయకత్వం వహించే సంఘాల ప్రతినిధులు కూడా అదే విలువలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉంది. అధికారులతో అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడం ప్రజాస్వామ్య పద్ధతి. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే సమాజానికి ఎలాంటి సంకేతం వెళ్తుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**పద్మ ఆవేదనపై ఉన్నతాధికారుల స్పందన ఏంటి..?**

తనపై జరిగిన తీరుతో తీవ్ర మనస్థాపానికి గురైన ఎంఈఓ పద్మ తన ఆవేదనను జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారంపై జిల్లా అధికారు లు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సంఘటనకు సంబంధించిన వాస్తవాలను పరిశీలించి, సంబంధిత అధికారులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకుల నుంచి వివరాలు తీసుకున్న తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకు నే అవకాశం ఉంది.

**అధికారిణి గౌరవం.. సంఘాల బాధ్యత**

ఉపాధ్యాయ సంఘాల అసలు కర్తవ్యం ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్చల ద్వారా పరిష్కారం సాధించడం. అదే సమయం లో అధికారులకూ ఉద్యోగుల సమస్యలను వినే బాధ్యత ఉంది. ఇరువర్గాలు పరస్పర గౌరవంతో వ్యవహరి ంచినప్పుడే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఒక మహిళా అధికారిణి మానసికంగా ఇబ్బందికి గుర య్యే పరిస్థితి రావడం మాత్రం ఆలోచించాల్సిన విష యమే. ఎంఈఓ పద్మ ఆవేదనపై జిల్లా ఉన్నతాధి కారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



# కల్తీ పన్నీర్‌పై నలుగురు పాత్రికేయుల పోరాటం అభినందనీయం

**- టిజిఎస్ రాష్ట కార్యదర్శి**

**టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



**హైదరాబాద్ సెప్టెంబర్ 12(పి సి డబ్ల్యూ న్యూస్):** కల్తీ పన్నీర్ తయారీ విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం నలుగురు పాత్రికేయులు గౌటి రామకృష్ణ, బొడికె వాణి, గంగి కృష్ణ, సతీష్ సాగిస్తున్న పోరాటం అభినందనీయమని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు.కల్తీ పన్నీర్ తయారీ విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న పాత్రికేయులపై భౌతిక దాడులు జరుగుతున్నప్పటికీ వారికి రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగమే పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదు చేయడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం కోసం నిజాలను వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయులను వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని రాజేష్ ఖన్నా పేర్కొన్నారు. పాత్రికేయులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించేలా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన రక్షణ కల్పించాలని కోరారు.ఈ విషయంపై తెలంగాణ రాష్ట సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే కలుగజేసుకొని పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి పాత్రికేయులపై నమోదైన అక్రమ కేసులను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా పాత్రికేయులపై దాడి చేసిన మాఫియా సభ్యులపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల శ్రేయస్సు కోసం నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులపై భవిష్యత్తులో దాడులు వేధింపులు జరగకుండా వారికి తగిన రక్షణ కల్పించేలా పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.ప్రజారోగ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న పాత్రికేయులకు తెలంగాణ గంగపుత్ర సంఘం అండగా నిలుస్తుందని రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం.. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం..

**● జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా ప్రెస్ కాన్ఫరెన్స్..**




**కరీంనగర్, టౌన్ సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దామోదర్ రావు అవేలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలు తదితర అంశాలపై నాయకులు చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.ప్రెస్ కాన్ఫరెన్స్‌లో డీసీసీ అర్బన్ అధ్యక్షుడు వి. అంజన్ కుమార్, సుడా మాజీ చైర్మన్ కె. నరేందర్ రెడ్డి, ఎస్సీఎస్టీ ఆర్‌జీఐ చైర్మన్లు అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, మోహన్, అలాగే జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్ పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతూ ప్రజలకు మరింత చేరువ కావాలని, పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఐఎం భవిష్యత్ ఆశాకిరణం.. ఆతిఫ్ ఆతిన?

**- యువ నాయకత్వం వైపు అధిష్టానం అడుగులు.. పార్టీ శ్రేణుల్లో ఆసక్తికర చర్చ**




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎంఐఎం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలనే చర్చ పార్టీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుత జెన్-జీ యుగంలో యువతను ముందుకు తీసుకెళ్లడం ద్వారా పార్టీ భవిష్యత్‌కు పటిష్ట పునాది వేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలో యువ నాయకుడు ఆతిఫ్ ఆతిన పేరు పార్టీ శ్రేణుల్లో ప్రముఖంగా వినిపిస్తున్నట్లు చర్చ సాగుతోంది. నమాజ్, దీన్, ఇమాన్, నైతిక విలువలు, మంచి వ్యక్తిత్వం వంటి లక్షణాలతో యువతలో గుర్తింపు పొందిన నాయకుడిగా ఆయనకు మద్దతు పెరుగుతోందని అనుచరులు చెబుతున్నారు.గత మున్సిపల్ ఎన్నికల్లో ఎదురైన రాజకీయ నష్టాన్ని అధిగమించి పార్టీని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అవినీతి ఆరోపణలకు తావులేని, ప్రజల్లో విశ్వసనీయత కలిగిన నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కరీంనగర్ ప్రజానీకం, ఉలేమాలు, పార్టీ శ్రేణుల్లోని యువ వర్గాల్లో ఆతిన నాయకత్వంపై ఆసక్తి నెలకొన్నట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ఆతిఫ్ ఆతినకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి కొత్త ఊపు వస్తుందని, భవిష్యత్‌లో ఎంఐఎంను మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లగలరనే ఆశలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రముఖ కవి సుద్దాల అశోక్ తేజకు ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారం..




**కరీంనగర్ జిల్లా:సెప్టెంబర్ 12(పిసి డబ్ల్యూ న్యూస్):** తెలుగు భాష సంరక్షణ సంఘం తెలంగాణ సాహితి సంస్థ ఏటా ప్రధానం చేస్తున్న రాష్ట్రస్థాయి బుర్ర నర్సమ్మ- లింగారెడ్డి,స్మారక తెలంగాణ తెలుగు తేజం,పేరుతో ఇచ్చే సాహిత్య పురస్కారం 2026 కు ప్రముఖ కవి జాతీయ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ఎంపికయ్యారు.ఈ మేరకు పురస్కార కమిటీ చైర్మన్ అవా ర్డు వ్యవస్థాపకులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి,ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధ్యాసం సేనాధిపతి శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఈ పురస్కార ప్రధాన ఉత్సవం ఈ నెల 22న కరీంనగర్ పట్టణంలో నిర్వహించనున్నట్లు వివరించారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టి బిడ్డలు చేసిన అమూల్య సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందించనున్నట్లు పేర్కొన్నారు.

# బాధిత కుటుంబాలకు సండ్ర వెంకట వీరయ్య పరామర్శ

**దుర్గా వానికి సండ్ర నివాళులు**

**కార్యకర్తల యోగక్షేమాలే లక్ష్యంగా సండ్ర**

**అనారోగ్యంతో ఉన్న బీవీకి పరామర్శ**





**కల్లూరు, సెప్టెంబరు 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం జరిగిన పలు కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. కల్లూరు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బైర్ల వెంకటేశ్వరరావు (బీవీ) ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకున్న నేపథ్యంలో సండ్ర వెంకట వీరయ్య ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అనంతరం పుల్లయ్య బంజార గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పెద్దబోయిన నారాయణరావు సతీమణి దుర్గావాణి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న సండ్ర వెంకట వీరయ్య ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, మాజీ జెడ్పీటీసీలు కట్టా అజయ్‌బాబు, లక్కినేని రఘు, మేకల కృష్ణ, కల్లూరు సొసైటీ అధ్యక్షుడు బోబోలు లక్ష్మణరావు, మండల యువజన అధ్యక్షుడు,18వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ, మండల నాయకులు దేవరపల్లి భాస్కరరావు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, ఉబ్బన వెంకటరత్నం, మాజీ సర్పంచులు పుల్లారెడ్డి, రాములు, బీరెల్లి పురుషోత్తం, పొట్రూ కిరణ్, బానోత్ కృష్ణ, చారుగుండ్ల సందీప్, కళ్యాణ్‌కిషోర్, ఖమ్మంపాటి రమేష్, సయ్యద్ ఇంతియాజ్, నరసింహారావు, రామవరపు ప్రసాద్, ఉబ్బన వేణుబాబు, సీహెచ్ కృష్ణ, రఘువరావు, కంచపోగు సురేష్ పాల్గొన్నారు.

# జోగినపల్లి సంతోష్‌కుమార్ పంపించిన విత్తన గణపతుల పంపిణీ..



**గంగాధర సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఉద్దేశంతో మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ పంపించిన విత్తన గణపతులను శనివారం గంగాధర మండల బీ ఆర్ ఎస్ ప్రెసిడెంట్ మేచినేని నవీన్ రావుకి పంపిణీ చేయడం జరిగింది. వినాయక చవితి సందర్భంగా మట్టి, విత్తనాలతో తయారు చేసిన గణపతి ప్రతిమలను పూజ అనంతరం నాటడం ద్వారా మొక్కలను పెంచవచ్చని నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తి, ప్రకృతి సంరక్షణను కలిపే ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విత్తన గణపతులను ప్రోత్సహించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పుటుకం రవీంద్రనాథ్ ఠాగూర్ ఎడ్ల అనిల్ మనోహర్ చందు వేణు పాల్గొన్నారు.

# రాష్ట్రీయ హిందీ దివస్ ఘనంగా నిర్వహణ..




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రీయ హిందీ దివస్ సందర్భంగా హిందీ ప్రేమ మండలి, కరీంనగర్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సెప్టెంబర్ 12న ప్రణామ్ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్, జెడ్పీ క్వార్టర్స్‌లో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు మైదం శివకాంత్ పటేల్, కోల అన్నారెడ్డి,పెద్ది విద్యాసాగర్, ముక్క శరత్ కృష్ణ, బట్టు వినోద్, సింగమ రాజు తదితర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ అధ్యక్షులు ఎం. అంజయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు హిందీ భాష యొక్క గొప్పతనం, ప్రాధాన్యత మరియు సాహిత్య విలువలను వివరించారు. జాతీయ సమైక్యతలో హిందీ భాష పోషిస్తున్న కీలక పాత్రను వారు కొనియాడారు.ఈ సందర్భంగా ప్రముఖ కవి లిసబ్బని లక్ష్మీనారాయణలి రచించిన లి'మౌన సముద్రం'లి కవితా సంకలనాన్ని హిందీలోకి అనువదించిన సందర్భంగా పుస్తకాన్ని వేదికపై ఉన్న ప్రముఖులు ఆవిష్కరించారు.అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన లి50 మందికి పైగా హిందీ పండితులు, హిందీ ఉపాధ్యాయులనులి లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారికి ప్రశంసాపత్రాలు, శాలువాలు అందజేసి హిందీ భాష, సాహిత్యం మరియు విద్యా రంగానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో లిబోయినపల్లి హనుమంతరావు, చింతల సత్యనారాయణ, కేశవరెడ్డి, ప్రొఫెసర్ వాసాల వరప్రసాద్‌లి తదితరులు పాల్గొన్నారు.హిందీ ఉపాధ్యాయులు లిఉమర్ అలీ, ఎం. భారతి, విజయలక్ష్మి, యోగా సంపత్, బాల్ రెడ్డి, నుజెట్టి రవీంద్రనాథ్, శివనారాయణలి తదితరులు పాల్గొన్నారు.హిందీ భాష, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్న పండితులు మరియు ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా లిలయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సేవా కార్యక్రమాలతో పాటు విద్యా, భాషా మరియు సాహిత్య రంగాల్లో కూడా తన సేవా స్ఫూర్తిని కొనసాగిస్తోందనిలి నిర్వాహకులు తెలిపారు.

# మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణం పరిరక్షిద్దాం.

**- నరేంద్ర విద్యాలయం కరస్పాండెంట్ గంగాధర రాజేశం..**



**గంగాధర సెప్టెంబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మండలంలోని లక్ష్మీదేవి పల్లె గ్రామంలో వినాయక చవితి పండగను భక్తి శ్రేద్ధలతో జరుపుకోవడం తో పాటు పర్యావరణం కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని నరేంద్ర విద్యాలయం హై స్కూల్ యాజమాన్యం గంగాధర రాజేశం, గుజ్జుల గోపాల్ రెడ్డి అన్నారు. పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులు అత్యంత భక్తితో, ఉత్సాహం, మట్టి విగ్రహాలు తయారు చేశారు. విద్యార్థులు వివిధ అకృతులతో వినాయకులను తయారు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రంగుల తో రాశాయనాలను ఉపయోగించి విగ్రహాలు తయారు చేయడం వల్ల నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. మట్టి విగ్రహం ప్రతిష్ట చేసుకుంటే ఎలాంటి కాలుష్యం ఉండదన్నారు. విద్యార్థులు తమ తల్లితండ్రులుకు వివరించాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం..

**- రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు..**

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు**

**- జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో 3వ జాతీయ లోక్ అదాలత్ ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి**










**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ...ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ, వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు. ప్రాచీనకాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు విభాగం, న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ... సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు. పోలీసు శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా, ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని, ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

---

## మహమ్మద్ యాకూబ్ ఆరోగ్యంపై ఆరా తీసిన ఏఐఎంఐఎం బృందం..



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా రేకుర్తి సలాహ్‌నగర్‌లోని 19వ డివిజన్ ఏఐఎంఐఎం డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ యాకూబ్ ను ఏఐఎంఐఎం అస్లీ మజ్లిస్ కరీంనగర్ బృందం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంది. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న నాయకులు త్వరగా, పూర్తిగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా 61వ డివిజన్ కార్పొరేటర్, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ అతీఫ్ (అతీనా) పాల్గొన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, 65వ డివిజన్ కార్పొరేటర్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సుధాకర్, అజాజ్, వార్డు అధ్యక్షుడు సమీ, మాజీ వార్డు సభ్యుడు సమీ తదితరులు హాజరయ్యారు. సహచరులు, ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలవడమే తమ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.

## ఏచూరి ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి

**- సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా నివాళులు**




**కల్లూరు, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, వామపక్ష ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా కల్లూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సీతారాం ఏచూరి తన జీవితాంతం ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిరంతరం పోరాడారని అన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి జాతీయ స్థాయి రాజకీయాల వరకు ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కేంద్రంలో మతతత్వ శక్తులు బలపడుతున్న సమయంలో లౌకిక భారతదేశ పరిరక్షణ కోసం ఏచూరి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, యువత, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన ఎప్పుడూ గళమెత్తారని తెలిపారు. సీతారాం ఏచూరి చూపిన మార్గంలో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ప్రజలపై భారాలు మోపే విధానాలకు, మతోన్మాదానికి, నిరుద్యోగానికి, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాలకు నిరంతర స్ఫూర్తి ఎర్రజెండా ఉన్నంతకాలంఆయన ఆశయాలు ప్రజల మధ్య జీవిస్తూనే ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ డివిజన్ కార్యదర్శివర్గం సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావ్, ఐద్వా సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, మండల కమిటీ సభ్యులు గంపల శ్రీనివాస్ రావు, నాయకులు తాళ్ల వెంకటేశ్వరరావు, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

---

## 'నాతోనే మార్పు' కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల బలమైన అనుబంధంపై అవగాహన

**ఏటూరునాగారం, సెప్టెంబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం జూనియర్ కాలేజ్ (గర్ల్స్), ఏటూరునాగారంలో 'నాతోనే మార్పు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం విద్యార్థులు చెడు వ్యసనాలు, మొబైల్ ఫోన్ అధిక వినియోగం వంటి అలవాట్లకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలి, సత్ప్రవర్తన, క్రమశిక్షణతో విద్యను కొనసాగించేలా అవగాహన కల్పించడం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాదిక్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య బలమైన అనుబంధం ఎంతో అవసరమని అన్నారు. పిల్లల భావాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అర్థం చేసుకుని వారికి అండగా నిలవాలని సూచించారు. "ప్రేమతో కలుద్దాం బాధ్యతతో వ్యవహరిద్దాం, బడిని వదలొద్దు భవిష్యత్తును కోల్పోవద్దు, విని అర్థం చేసుకుందాం తోడుగా నిలుద్దాం" అనే సందేశంతో విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. మొబైల్ ఫోన్‌కు బానిస కాకుండా జాగ్రత్త వహించాలని, చెడు వ్యసనాలు మరియు ఆకర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు, ఎవరితో స్నేహం చేస్తున్నారు, వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అనే విషయాలను ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. పిల్లలను కళాశాలలో చేర్పించే సమయంలో వారి ఆరోగ్య పరిస్థితి, ప్రత్యేక అవసరాలు వంటి విషయాలను ఉపాధ్యాయులకు తప్పనిసరిగా తెలియజేయాలని తల్లిదండ్రులకు సూచించారు. "నా బిడ్డ ఆరోగ్యం నా బాధ్యత, మా బడి మా గుడి" అనే భావనతో తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, ప్రవర్తన, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సాదిక్ తెలిపారు.





పిల్లల భవిష్యత్తును మంచి మార్గంలో నడిపించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. విమల మాట్లాడుతూ, నేటి సమాజంలో విద్యార్థులు వివిధ చెడు అలవాట్లకు ఆకర్షితులయ్యే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు ఇంటికి వచ్చినప్పుడు వారి చదువు, కళాశాల అనుభవాలు, స్నేహితులు, ప్రవర్తన తదితర విషయాలను ప్రేమగా అడిగి తెలుసుకోవాలని అన్నారు. అలాగే, తమ పిల్లలు కళాశాలలో ఎలా ఉంటున్నారనే విషయాన్ని సంబంధిత హౌస్ మాస్టర్లను అడిగి తెలుసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కళాశాలలో విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి వారి విద్య, ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తు కోసం శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ పిల్లలను ఇంటి వద్ద కూడా జాగ్రత్తగా గమనిస్తూ, వారి చదువు మరియు ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ప్రిన్సిపాల్‌కు హామీ ఇచ్చారు. చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కనీసం మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని తల్లిదండ్రులు సూచించారు. విద్యార్థులకు నిరంతరం మోటివేషన్ కల్పించడం ద్వారా వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు, తమ లక్ష్యాల పై దృష్టి సారించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఉన్నత విద్య, భవిష్యత్తు అవకాశాల పై కూడా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని కోరారు. "మీ పిల్లల చదువును గమనించండి వారి భవిష్యత్తును నిర్మించండి" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునులు మరియు విద్యార్థినిలు ,తల్లిదండ్రులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

---

## తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

**కల్లూరు, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్)** :తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో వినాయక చవితి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు నిర్వహించి, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను తీసుకువచ్చారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసి తీసుకువచ్చిన వివిధ ఆకృతులు, అలంకరణలతో కూడిన మట్టి వినాయక విగ్రహాలను పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్




మాట్లాడుతూ, మట్టి వినాయక విగ్రహాల వినియోగం పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోవడంతో నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మరియు రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని సూచించారు. పండుగల ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో పాటు ప్రకృతిని కాపాడే బాధ్యతను కూడా విద్యార్థులు అలవర్చుకోవాలని పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భక్తి, సృజనాత్మకత, సంప్రదాయాల పట్ల గౌరవం మరియు పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందించబడింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ షేక్ జానిమియా విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత..

**• 50వ డివిజన్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేసిన కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ కుమార్**







**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 50వ డివిజన్ లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ కుమార్ స్వయంగా డివిజన్ ప్రజలకు మట్టి వినాయకులను పంపిణీ చేసి, ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల జల వనరులు, పర్యావరణం తీవ్రంగా కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలంతా మట్టి వినాయకులను పూజించి, పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమల వైపు మొగ్గు చూపాలని, సంప్రదాయబద్ధంగా పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కాలనీవాసులు, డివిజన్ ప్రముఖులు మరియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి విగ్రహాలను స్వీకరించారు.

# సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**- మేధావుల సదస్సులో వక్తలు....**

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు, సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం రోజున జ్యోతి నగర్‌లోని ఎం బ్యాంకెట్ హాల్‌లో తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచనం- జాతీయ వాదుల పాత్ర పై మేధావుల సమావేశం నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు మేధావులు, వక్తలు మాట్లాడుతూ.. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం లభించిన తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్రం రాలేదన్నారు. ఆనాటి హైదరాబాద్ సంస్థానం నిజాం కబంధహస్తాల్లో బందీ అయ్యిందని , నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాల నుండి తెలంగాణ ప్రజలు విముక్తి పొందిన చారిత్రక దినం సెప్టెంబర్ 17 అని గుర్తుచేశారు. నాటి రాచరిక పాలనలో ప్రజలు అనుభవించిన యాతనలను, అణచివేతలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. దేశ ప్రథమ హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' చారిత్రక విజయం సాధించడం వల్లే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని స్పష్టం చేశారు.





తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను, నాటి విమోచన ఉద్యమ వాస్తవాలను మరుగున పడేసేలా కొందరు రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని వక్తలు మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా గత పాలకులు ఈ చారిత్రక దినాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడారని విమర్శించారు. తెలంగాణ సమాజం సాధించుకున్న స్వేచ్ఛా స్ఫూర్తిని, త్యాగాల చరిత్రను భావితరాలకు, నేటి యువతకు అందించాల్సిన బాధ్యత మేధావులపై, విద్యావేత్తలపై ఉందని అభిప్రాయపడ్డారు. విమోచన దినోత్సవ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, ప్రతి ఏటా ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ, తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా జిల్లా వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 17న ప్రతి గ్రామస్థాయిలో, వార్డుల్లో జాతీయ జెండాలు ఎగురవేసి, విమోచన యోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పోరాట చరిత్రను ప్రతి ఇంటికి తీసుకువెళ్లేందుకు యువత, మేధావులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు బిజెపి నాయకులు, కార్యకర్తల లతో పాటు నగరంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ మేధావులు, విద్యావేత్తలు, సామాజిక విశ్లేషకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# మట్టితో చేసిన వినాయక ప్రతిమల పంపిణీ




**కాకినాడ, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ ఆధ్వర్యంలో శనివారం రెండు వేల మట్టి వినాయక ప్రతిమలు, గుడ్డ సంచులను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. కాలుష్య రహిత వినాయక చవితి నిర్వహణలో భాగంగానే మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జిల్లా గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు లయన్స్ క్లబ్ పర్యావరణ పరిరక్షణలో విశిష్ట సేవలు అందిస్తోందని అభినందించారు. లయన్ జీవీఎల్ జగన్నాథరావు అందించిన హనుమత్ భక్తి పుస్తకాలను కూడా ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి కృష్ణమూర్తి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ డి. రామసుబ్రహ్మణ్యం, ప్రాజెక్ట్ చైర్మన్ ఎంవీఆర్ మోహన్ కుమార్, కార్యదర్శి వీవీకే నూకాజీ, మేడిశెట్టి వెంకటరమణ, పీవీ సుబ్బారావు, దీక్షితుల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నాలు తొలగించి విజయాలు అందించే విఘ్నేశ్వరుడు

**• ప్రముఖ వ్యాపారవేత్త, గెల్లా గ్రాండ్ అధినేత గెల్లా రవి • భక్తుల ఆధ్యాత్మిక సేవ కోసం 'శ్రీ వినాయక వ్రతకల్పం' పుస్తకావిష్కరణ • ప్రతి ఇంటా వినాయకుడి ఆశీస్సులు వెల్లివిరియాలి • సీనియర్ జర్నలిస్ట్, వాసవి జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక సభ్యులు టీఎస్ చక్రవర్తి**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వినాయక చవితి పర్వదినం ప్రతి ఇంటా భక్తి పరిమళాలను వెదజల్లుతూ, విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో జీవితంలోని ఆటంకాలు తొలగి సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు కలగాలని కోరుకునే పవిత్ర సందర్భం. ఈ ఆధ్యాత్మిక పర్వదినం సందర్భంగా భక్తులకు పూజా విధానాన్ని మరింత సులభంగా చేరువ చేయాలనే సేవాభావంతో ప్రముఖ వ్యాపారవేత్త, ఖమ్మం క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, గెల్లా గ్రాండ్ అధినేత గెల్లా రవి ప్రత్యేకంగా ముద్రించిన 'శ్రీ వినాయక వ్రతకల్పం' పుస్తకాన్ని శనివారం గెల్లా గ్రాండ్‌లో ఆర్యవైశ్యుల మధ్య ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గెల్లా గ్రాండ్ అధినేత గెల్లా రవి మాట్లాడుతూ.. వినాయకుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించే ప్రతి కుటుంబానికి సంప్రదాయబద్ధమైన పూజా విధానం అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఈ పుస్తకాన్ని ముద్రించి భక్తులకు అందిస్తున్నట్లు గెల్లా రవి తెలిపారు. పూజా విధానం తెలియని వారు సైతం సులభంగా వ్రతాన్ని ఆచరించేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. హిందూ ధర్మంలో వినాయక చవితికి అత్యంత విశిష్టమైన స్థానం ఉందన్నారు. భాద్రపద శుద్ధ చవితి రోజున విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం అనాదిగా వస్తున్న పవిత్ర సంప్రదాయమని తెలిపారు. గణనాథుడి కరుణాకటాక్షాలతో జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు, ఆటంకాలు తొలగిపోయి ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, ఐశ్వర్యం, విజయాలు వెల్లివిరియాలని భక్తులు కోరుకుంటారని అన్నారు. పండుగ అంటే కేవలం సంబరాలు మాత్రమే కాదని, మన సంప్రదాయాలను తరువాతి తరాలకు అందించడంతో పాటు భక్తి, ఆధ్యాత్మికత, మానవీయ విలువలను పెంపొందించే సందర్భమని ఆయన పేర్కొన్నారు. అందుకే భక్తులకు ఉపయోగపడే విధంగా 'శ్రీ వినాయక వ్రతకల్పం' పుస్తకాన్ని అందించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ప్రముఖ వ్యాపారవేత్త కల్వకుంట్ల గోపాల్ మాట్లాడుతూ... వినాయక చవితి సందర్భంగా భక్తులకు అత్యంత ఉపయోగకరమైన పూజా విధానాన్ని పుస్తక రూపంలో అందించడం అభినందనీయమన్నారు. సీనియర్ జర్నలిస్ట్, వాసవి జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక సభ్యులు టీఎస్ చక్రవర్తి మాట్లాడుతూ... వినాయకుడి పూజా విధానం ప్రతి ఇంటికీ చేరేలా చేయడం ఒక ఆధ్యాత్మిక సేవతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే మంచి ప్రయత్నమని కొనియాడారు. ప్రతి ఇంటా వినాయకుడి ఆశీస్సులు వెల్లివిరియాలన్నారు. వ్యాపార రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గెల్లా రవి సేవాభావంతో, సాదాసీదా స్వభావంతో సమాజంలోని అన్ని వర్గాలతో కలిసిమెలిసి ఉండటం అభినందనీయమన్నారు. భక్తులకు అవసరమైన పూజా విధానాన్ని ఉచితంగా అందించాలనే ఆలోచనలో ఆయనలోని సామాజిక బాధ్యత, ఆధ్యాత్మిక సేవాభావం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంటా గణనాథుడి నామస్మరణ మార్మోగాలని, భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుడిని పూజించే ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని, జీవితంలోని కష్టాలు, కన్నీళ్లు, విఘ్నాలు తొలగిపోయి సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. పులిపాటి వాసవినగర్ అధ్యక్షులు కొదుమూరి భద్రయ్య, తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య రాష్ట్ర అధ్యక్షులు సిద్ధంశెట్టి శ్రీకాంత్, జిల్లా ఆర్య వైశ్య సభ నాయకులు బూర్లే పుల్లారావు, వ్యాపారవేత్తలు గెల్లా శ్రావణ్, గెల్లా సుజన్ కుమార్, వందనపు కరుణాకర్ పాల్గొన్నారు.

# జల్లా రామాంజనేయులు రెడ్డి మృతికి వైసీపీ నేతల సంతాపం

**• పార్థివ దేహానికి నివాళులర్పించిన వైఎస్ భాస్కర్ రెడ్డి, వేముల మండల వైకాపా నాయకులు**

**• కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి**




**వేముల సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** -వేముల మండల పరిధిలోని స్థానిక గుండ్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు,మాజీ డీలర్ జల్లా రామాంజనేయులు రెడ్డి (56) మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది.సుమారు ఆరు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన ఆయన అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు.ఆయన మృతి పట్ల గుండ్లపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రామాంజనేయులు రెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి శనివారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి, జడ్పీటీసీ కోకటం వెంకట బైయపిరెడ్డి, ఎంపీపీ భర్త చల్లా వెంకట నారాయణలతో కలిసి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం రామాంజనేయులు రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ... కష్ట సమయంలో పార్టీ పూర్తి అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా రామాంజనేయులు రెడ్డి వైఎస్సార్‌సీపీలో అందించిన సేవలను పలువురు నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వేమ నారాయణరెడ్డి,మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి,చెల్లుబోయిన రెడ్డయ్య,మధుసూదన్ రెడ్డి,జైయచంద్ర రెడ్డి,గుండ్లపల్లి సాంబశివరెడ్డి,నాగప్పతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు,కుటుంబ సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొని రామాంజనేయులు రెడ్డి పార్థివ దేహానికి ఘనంగా నివాళులర్పించారు.

# యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఏర్పుల శ్రీనివాస్ నియామకం

**పార్టీ బలోపేతానికి, సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేస్తా: ఏర్పుల శ్రీనివాస్**

**అక్షర దివిటీ, సెప్టెంబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని మెహర్‌నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏర్పుల శ్రీనివాస్ ను యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శనివారం శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో పాటు జిల్లా నాయకులు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు కళ్లెం రాఘవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ తడక వెంకటేశ్వర్లు, పోచంపల్లి పార్టీ అధ్యక్షుడు ఉపునూతల వెంకటేశం యాదవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాసుల అంజయ్య,



పోచంపల్లి మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ కొండమడుగు ఎల్లస్వామి, సామ మధుసూదన్ రెడ్డి, సామ మోహన్ రెడ్డి, మర్రి నరసింహారెడ్డి, నల్ల నగేష్ తదితరులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి అంకితభావంతో పనిచేస్తానని శ్రీనివాస్ పేర్కొన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు సక్రమంగా అందేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు.




# నా సినిమాలను నేను చూడలేను: ప్రీతి జింటా

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.

# రచ్చ లేపడానికి రెడీ..

## ఒక్క పోస్టుతో 'స్వయంభూ'పై అంచనాలు పెంచేసిన నిఖిల్



యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం 'స్వయంభూ'పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై నిఖిల్ తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ పంచుకున్నారు. ఒకే సినిమా కోసం 175 రోజులు షూటింగ్ చేయడం, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉండటం తన కెరీర్‌లో ఇదే తొలిసారని ఆయన తెలిపారు. మంచి ప్రయత్నాలకు సమయం పడుతుందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.ఈ మేరకు నిఖిల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ""స్వయంభూ' ఒక పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మంచి పనులకు సమయం పడుతుంది. మేము దాదాపు ఆ దశకు చేరుకున్నాం. ఒకే సినిమా కోసం 175 రోజులు షూట్ చేస్తానని, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ... రచ్చ లేపడానికి రెడీ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటన ఉంటుంది" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది.ఇటీవల హీరోయిన్ సంయుక్త పుట్టినరోజు సందర్భంగా, ఆమె పోషిస్తున్న 'భూమి' పాత్రకు సంబంధించిన ఒక బీటీఎస్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడిన కష్టం స్పష్టంగా కనిపించింది. ఈ సినిమా కోసం సంయుక్త ఎంతో ధైర్యంగా ఒక ప్రమాదకరమైన స్టంట్ చేశారని దర్శకుడు భరత్ కృష్ణమాచారి గతంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఒక సన్నివేశంలో, కింద నది ప్రవహిస్తుండగా కేవలం ఒకే ఒక్క హార్నెస్ సాయంతో ఆమె రెండు రోజుల పాటు తాడుపై వేలాడుతూ పర్వతాన్ని అధిరోహించారని వివరించారు.ఈ సినిమా కోసం హీరో నిఖిల్ కూడా వియత్నాం వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు.

కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా సినిమాలో నటించిన వందలాది మంది సహాయ నటీనటులకు కూడా వియత్నాం నుంచి వచ్చిన నిపుణులతో కత్తి యుద్ధంలో శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించారు.

# విడుదలకు ముందే 'స్పిరిట్' పై రగడ..

## రివ్యూవర్స్‌కు సందీప్ వంగా సోదరుడి సవాల్!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న 'స్పిరిట్' చిత్రంపై అప్పుడే ఓ కొత్త వివాదం రాజుకుంది. సినిమా విడుదల కాకముందే, సినీ విమర్శకులను ఉద్దేశించి సందీప్ సోదరుడు, చిత్ర నిర్మాతల్లో ఒకరైన ప్రణయ్ రెడ్డి వంగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. 'స్పిరిట్' సినిమాను తమ రివ్యూలతో 'చంపేయండి' చూద్దాం అంటూ ఆయన బహిరంగంగా సవాల్ విసిరారు.

ఇటీవల ఆయన నిర్మాణంలో వచ్చిన 'రోమాంచకం' చిత్రానికి మిశ్రమ స్పందన లభించిన నేపథ్యంలో ప్రణయ్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక సినిమాను తెరకెక్కించడానికి పడే కష్టం తెలియకుండా విమర్శకులు సులభంగా రివ్యూలు రాస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

"మీరు నిర్మాణ రంగంలోకి వస్తేనే ఒక దర్శకుడు కథను తెరపైకి తీసుకురావడానికి ఎంత కష్టపడతాడో, ఎన్ని సమస్యలు ఎదురవుతాయో తెలుస్తుంది" అని ఆయన అన్నారు. ఈ క్రమంలోనే తమ తదుపరి భారీ ప్రాజెక్ట్ 'స్పిరిట్' గురించి ప్రస్తావిస్తూ.. "వారికి నిజంగా సత్తా ఉంటే, 'స్పిరిట్' విడుదలైనప్పుడు చూద్దాం. ఆ సినిమా రిలీజ్ అయ్యాక దాని స్పిరిట్‌ను 'కిల్' చేయడానికి ప్రయత్నించండి, అప్పుడు చూసుకుందాం" అని ప్రణయ్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు.

'స్పిరిట్' సినిమా విషయానికొస్తే.. ప్రభాస్-సందీప్ వంగా కలయికలో వస్తున్న తొలి చిత్రమిది. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ మూవీలో ప్రభాస్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఈ చిత్రంలో కథానాయికగా 'యానిమల్' ఫేమ్ తృప్తి డిమ్రీని ఖరారు చేశారు. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇదిలా ఉంటే.. సల్మాన్ ఖాన్ సినిమాతో పోటీని తప్పించుకోవడానికి 'స్పిరిట్' విడుదల 2027 ఈద్ నుంచి వాయిదా పడుతుందని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే, ఈ ప్రచారాన్ని చిత్ర నిర్మాణ సంస్థ టీ-సిరీస్ కొట్టిపారేసింది. "సినిమా విడుదల తేదీలో ఎటువంటి మార్పు లేదు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే షూటింగ్ జరుగుతోంది. 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా 'స్పిరిట్' ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని టీ-సిరీస్ ప్రతినిధి స్పష్టం చేశారు.




# రామ్ పోతినేని సినిమాలో హీరోయిన్‌గా సంయుక్త

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'చ=ాూూ23'. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు చిత్రబృందం తెరదించింది. ప్రముఖ నటి సంయుక్తను కథానాయికగా ఎంపిక చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సంయుక్త పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటన వెలువడటం విశేషం.సంయుక్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రాజెక్ట్‌లోకి ఆమెను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు మేకర్స్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. రామ్, సంయుక్త జంటగా నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ నూతన కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని ఒక వినూత్నమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు.

నియో-నోయర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రానికి సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు. రామ్ సోదరుడు కృష్ణ పోతినేని భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు కనిపించని సరికొత్త అవతార్‌లో రామ్ ఈ సినిమాలో అలరించనున్నారని, నటుడిగానే కాకుండా దర్శకుడిగా కూడా ఈ చిత్రం ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని చిత్ర వర్గాలు వెల్లడించాయి.

# పెళ్లి గుర్తుగా పురుషులు కూడా ఏదైనా ధరించాలి: నటి నమిత

ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి నమిత... పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా వివాహ వ్యవస్థ, మహిళలపై అమలవుతున్న సంప్రదాయ నిబంధనలపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి చర్చల్లో నిలిచారు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలను, భావోద్వేగాలను కలిపే సమానమైన బంధమని... అలాంటప్పుడు పెళ్లికి సంబంధించిన నియమాలు, బాధ్యతలు కేవలం మహిళలకే ఎందుకు పరిమితం కావాలని ఆమె ప్రశ్నించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.వివాహ ఆచారాల గురించి మాట్లాడుతూ... పెళ్లి తర్వాత మహిళలు ఎలా ఉండాలి, ఏం ధరించాలి, ఏయే సంప్రదాయాలను పాటించాలి అనే విషయంలో సమాజంలో ఎన్నో నియమాలు ఉంటాయని నమిత అన్నారు. కానీ పురుషుల విషయంలో ఇలాంటి నిబంధనలు, ఆంక్షలు చాలా తక్కువగా ఉండటం సరైనది కాదని... మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వివాహానికి గుర్తుగా మహిళలు మాత్రమే తాళిబొట్టు ఎందుకు ధరించాలని, పెళ్లయిందనే గుర్తింపుగా పురుషులు కూడా ఏదో ఒక గుర్తును ఎందుకు ధరించకూడదని ఆమె అన్నారు.నమిత చేసిన ఈ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆధునిక కాలంలో భార్యాభర్తలిద్దరికీ సమాన హక్కులు, ప్రాధాన్యత ఉండాలని కోరుకునే కొందరు నెటిజన్లు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తుండగా... మరికొందరు మాత్రం తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాల ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా ఇలా ప్రశ్నించడం సరికాదని విమర్శలు గుప్పిస్తున్నారు.

